క్లుప్తంగా

17న కంటి వైద్యశిబిరం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని పూర్వవిద్యార్థుల భవన్‌లో ఆత్మకూర్ (ఎస్) పూర్వవిద్యార్థుల సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే వైద్యశిబిరంలో గ్రామస్తులు ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రి బస్సులోనే హైదరాబాద్‌కు తీసుకెళ్లి చేయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు డీఏలను ప్రకటించాలి

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీయూ) అసోసియేట్ జిల్లా ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి కరువు భత్యం పెంచాలన్నారు. 2022జూలై నుంచి డీఏలను చెల్లించడం లేదన్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


పేరాల గోపి

నాగారం : మండలంలోని ఈటూరు గ్రామంలో ప్రతిభ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పేరాల గోపి, గౌరవ అధ్యక్షుడిగా వంగూరి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా బోడ కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా వంగూరి అవిలమల్లు, కోశాధికారిగా వంగూరి మహేష్, సహాయ కార్యదర్శిగా పేరాల రాజు, సాంస్కృతిక కార్యదర్శిగా పేరాల దయానంద్, క్రీడల కార్యదర్శిగా బోడ జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పేరాల గోపి మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ విద్యాబలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు విరాళం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి రజక సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ–సినీ సంగీత దర్శకుడు అగస్త్య దంపతులు రూ.21,116 విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బోరు ఏర్పాటు


బోరు వేయిస్తున్న రేఖ, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నెలకొన్న నీటి సమస్యను రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ మంగళవారం బోరు వేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరు వేయించి ట్యాంకు నిర్మాణం చేపట్టి ఆలయానికి వచ్చే భక్తులకు నీటి సమస్య లేకుండా చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయంలో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, గ్రామశాఖ అధ్యక్షుడు మేకల రాంబాబు, మామిడి చినపుల్లయ్య, మామిడి శ్రీనివాస్, మనోహర్, కోటి ప్రసాద్, శ్రీకాంత్, ప్రభు, వీరయ్య, వెంకన్న, సాయి, శేఖ ర్, రాంబాబు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

మునగాల : మండల కేంద్రంలో గౌడ వృత్తి ఆధారంగా జీవిస్తున్న పలువురు గీత కార్మికులకు మంగళవారం రక్షణ కవచ కిట్లను (సేఫ్టీ మోకులు) పంపిణీ చేసినట్లు కౌండిన్య గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గండు అంజయ్య తెలిపారు. కౌండిన్య సంఘం రాష్ట్ర నాయకుడు కేఎల్ఎన్.ప్రసాద్ తన సొంత ఖర్చులతో మండల కేంద్రానికి చెందిన 40 మంది గీత కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి సేఫ్టీ మోకులు అందజేసినట్లు తెలిపారు. జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిల సహకారంతో ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం నుంచి పథకాలు, సాయం అందే విధంగా కృషిచేస్తామని అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో గీత కార్మికులు బత్తిని సీతారాములు, అంతుల రాములు, మండవ వెంకటేశ్వర్లు, వత్సవాయి రాములు, బత్తిని నాగరాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- నిర్మాణాలకే పరిమితమైన వైనం
- పట్టించుకోని పాలకులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- దుర్వినియోగం అవుతున్న ప్రజాధనం


గూడెపుకుంటతండాలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు


దూపహాడ్‌లో బహిరంగ ప్రదేశంలో పారబోసిన చెత్త (ఫైల్)

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారుచేయాలనే లక్ష్యంగా గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేసింది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు సేంద్రియ ఎరువును సమకూర్చాలని ఒక్కో పంచాయతీకి సెగ్రిగేషన్ షెడ్డును అందుబాటులోకి తీసురావాలని సంకల్పించి ఒక్కో షెడ్డుకు రూ.2.50లక్షలు వెచ్చించి నిర్మాణం చేశారు. ఉపాధిహామీ పథకంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులు నిర్మించిన నాటి నుంచి నేటి వరకు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 29గ్రామ పంచాయతీలకు గాను ప్రతి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించగా వినియోగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త డంపింగ్..

సెగ్రిగేషన్ షెడ్ల పరిసరాలలోనే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి వాటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలనేది సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణ ముఖ్య ఉద్దేశ్యం. కానీ అవగాహన లేమితో సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తీసుకురాకపోవడమే కాకుండా ఇష్టారీతిన బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తరలిస్తూ నిప్పుపెట్టి కాల్చేస్తున్నారు. రబ్బర్, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడంతో విషవాయువులు గాలిలో కలిసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. తద్వారా వాతావరణం కలుషితమై శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించి ఇప్పటి వరకు సుమారు 4సంవత్సరాలు గడుస్తున్నా వాటి నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా జమ కాకపోవడంతో పాటు అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా నా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సిబ్బందికి సరైన శిక్షణ అందించి గ్రామాలకు ఆదాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయ మార్గాలు..

గ్రామాల్లో సేకరించిన చెత్తలో వచ్చే ప్లాస్టిక్ బాటిళ్లు, ఖాళీ సీసాలు, కాగితాలను వేరు చేసి విక్రయించడంతో వచ్చే ఆదాయన్ని గ్రామ పంచాయతీల ఖాతాకు జమచేయాలి. ఆహార పదార్థాలు, కూరగాయలు తదితర వ్యర్థ పదార్థాలతో కంపోస్టు ఎరువులను తయారు చేసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కలు, నర్సరీల్లో ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. మిగిలిన ఎరువులను రైతులకు విక్రయించి వాటి నుంచి వచ్చిన డబ్బులను జీపీ ఖాతాల్లో వేసి గ్రామ అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

వినియోగంలోకి తీసుకురావాలి

పర్యావరణాన్ని కాలుష్యం నుంచి రక్షించేందుకు డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామాల్లో సేకరించిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే డంప్ చేయాలి. అంతే కాకుండా చెత్త నుంచి సంపదను సృష్టించే విధంగా సిబ్బందికి శిక్షణ నిస్తే గ్రామపంచాయతికి కొంత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.
– వెంకన్న, దూపహాడ్

ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటాం



అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తెచ్చి సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున త్వరలో వారికి శిక్షణ ఇచ్చి సేంద్రియ ఎరువుల తయారీ చేయించి పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


తిరుమలగిరిలో డిగ్రీ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తిరుమలగిరి ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర నాగయ్య, కరస్పాండెంట్ కోట కొమురయ్య కోరారు. మంగళవారం డిగ్రీ కళాశాల గేటుకు తాళం వేసి అధ్యాపకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని, దీంతో కళాశాల నిర్వహణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రావుల నర్సయ్య, సంకెపల్లి నరోత్తమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు సైదులు, సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, కిరణ్, ఓంకార్, కృష్ణ, యాకయ్య, వెంకన్న, సత్యం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చివ్వెంల : సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర అఖిల్‌కుమార్

చివ్వెంల : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను మానుకోవాలన్నారు. మూడేళ్లుగా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సర్టిఫికెట్లు అప్పులు చేసి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. ఆయన వెంట పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తుంగతుర్తి : మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన అందే ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ముత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎమ్మెల్యే మందుల సామేల్ పంపించిన రూ.5వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలకల వెంకన్న, కోతి యాకయ్య, జలగం పరశురాములు, శ్రీను, శివసాయి, గోపి, కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి


తుంగతుర్తిలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తుంగతుర్తి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుజ్జ భాస్కర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డికి ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జాటోత్ రాజన్న, చంద్రశేఖర్, గోపగాని ఉపేందర్, శ్రీరాములు, సుందరి శ్రీనివాస్, సుధీర్ రెడ్డి, చంద్రశేఖర్, రఘుపతి, సహదేవ్, యాకయ్య, కృష్ణవేణి, రాజు, నవీన్, ప్రసాద్, రవికుమార్, బాబు, సునీత, ఇంతియాజ్‌బేగం పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పెన్‌పహాడ్ : దుబ్బతండాలో వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యాధికారి వెంకన్న

పెన్‌పహాడ్ : పశువులకు వ్యాపిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి వెంకన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని దుబ్బతండాలో పశువులకు ముందస్తుగా వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్లసింగారం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలను వేయిస్తే రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


నూతనకల్ : గుండ్లసింగారంలో టీకాలు వేస్తున్న పశు వైద్యసిబ్బంది

నేటి నుంచి నివారణ టీకాలు

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పశువులకు ఈనెల బుధవారం నుంచి నవంబర్ 14వరకు నెలరోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి సీహెచ్ వేణుగోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మండలంలోని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేద ప్రజల పక్షాన పోరాడేది సీపీఎంమే


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చివ్వెంల : పేదల పక్షాన పోరాడేది సీపీఎం ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలక భూర్జువ పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు భ్రమలు కల్పించి హామీలు మర్చిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలకు భూమి పంపిణీ, విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలంటే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేదరికం అదుపు చేయలేని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ఈనెల 17నుంచి పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ధరల పెరుగుదలపై దేశ వ్యాప్తంగా అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో చేపట్టే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు పార్టీలో చేరడంతో వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామ శాఖ కార్యదర్శి నాశనబోయిన భూషయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి బచ్చలకూరి రాంచరణ్, సోమయ్య, పల్లేటి వెంకన్న, అబ్రహం, నాగయ్య, రాములు, తిరపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాకారుల అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ ఈర్ల సైదులు కోరారు. మంగళవారం మండలంలోని కోమటిపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాబృందం తమ ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళా బృందంజిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఎం.శంకర్, గద్దం ఉదయ్, పి.శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి.ఉపేందర్, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి


తుంగతుర్తిలోని జూనియర్ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు (ఎస్) : దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాండయ్య అన్నారు. మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ కలాం గొప్ప శాస్త్రవేత్తగా, ఇంజనీర్‌గా, భారతదేశం 11వ రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఏజీఎంసీ వెంకటేశ్వర్లు, డాక్టర్ సీహెచ్ గోవర్ధన్, సీనియర్ సిటీజన్ సంఘం జిల్లా కార్యదర్శి హమీద్ ఖాన్, నాగార్జున, లక్ష్మయ్య, దశరథ, మహేష్, సునీత, మమత, సరిత, మరియ, శ్రీధర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

నాగారం : దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ నాగులమీరా, పొదిల శ్రీను, హుస్సేన్, సయ్యద్, నజీర్‌పాష, జానీ, యాకూబ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని ప్రిన్సిపాల్ రాజామోహన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అబ్దుల్‌కలాం భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పుల్లయ్య, గణేష్, దయాకర్, నగేష్, నాగేశ్వరరావు, సిబ్బంది భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : భారతరత్న, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దామెర శ్రీనివాస్ మాట్లాడారు. అబ్దుల్ కలాం సేవలను ఆయన కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుమలగిరి : అబ్దుల్ కలాం జయంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నాగారం : శాంతినగర్‌లో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఆత్మకూరు (ఎస్) : నెమ్మికల్‌లో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

బ్రిడ్జి గుంతలతో ప్రమాదాలు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామపంచాయతీ ఆవాసం తూర్పుతండాకు వెళ్లే చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. కాసర్లపహాడ్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తూర్పుతండాకు వెళ్లే దారిలో చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అయితే చెరువు నిండి అలుగు పోస్తుండడంతో బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంతలు కనిపించక ఈ దారిలో వెళ్లే వారు అందులో పడి గాయపడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ గుంతల్లో పడి పదిమంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. మంగళవారం తండాకు చెందిన కేతావత్ సాత్విక్‌తో పాటు మరొకరు ఈ గుంతలో పడి గాయపడ్డారు. రెండు రోజుల కిందట కాసర్లపహాడ్‌కు చెందిన ఖాసీం గాయపడ్డాడు. అలాగే ఇదే దారిలో వెళ్తున్న ఆటో ఈగుంత వద్ద బోల్తాపడి కొంతమంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మునగాల : ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి మరో పక్షం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్, హార్టీ కల్చర్, ఇరిగేషన్ శాఖల సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈజీఎస్ విభాగంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా ప్రతి గ్రామపంచాయతీలో 300 శాతం పనులను అన్ని శాఖల సిబ్బందిని అనుసంధానం చేసుకొని వచ్చే నెల 20 లోగా గుర్తించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ఫైల్స్ నిర్వహణ, గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

అల్లుడిపై దాడి చేసిన మామపై కేసు

సూర్యాపేట: అల్లుడిపై గొడ్డలితో దాడి చేసిన మామపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన కొండి నవీన్‌కు సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామానికి చెందిన శ్రావణితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. గర్భవతి అయిన శ్రావణిని ఇటీవల తన తల్లిగారింటికి పంపించిన నవీన్.. ఈ నెల 12న దసరా పండుగకు అతడు కూడా అత్తగారి ఊరికి వెళ్లాడు. ఈ క్రమంలో మామ బుడిగె జానయ్య ఎందుకు వచ్చావని నవీన్‌పై గొడ్డలితో దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయమైంది. ఈ నెల 13న నవీన్ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. జానయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

వీధికుక్కల స్వైరవిహారం

- బయటకు రావాలంటే జంకుతున్న వృద్ధులు, చిన్నారులు


చివ్వెంలలో గుంపులుగా రోడ్డుపై సంచరిస్తున్న వీధికుక్కలు

చివ్వెంల : గ్రామాల్లో వీధికుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. మండలంలోని ఏ గ్రామంలో చూసినా వీధికుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న ప్రయాణికులను సైతం కుక్కలు వెంటాడి మరీ దాడి చేస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు భయంతో కిందపడి గాయాల భారిన పడుతున్నారు. ఇలా రోజుకు ఎక్కడో ఒక చోట వీధికుక్కల బారిన పడుతున్నారు. కాలినడకన వెళ్లేవారి పరిస్థితి గురించి చెప్పనక్కర్లేదు. ఇటీవల గ్రామాల్లో కుక్కలు కాటు వేయడంతో ప్రజలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు..

వీధికుక్కల స్వైరవిహారంపై పలుమార్లు గ్రామ పంచాయతీల్లో, మండల కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వీధికుక్కల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది

గ్రామాల్లో వీధికుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ వెంట పడుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వాటిని పట్టించి నివాసాలకు దూరంగా వదిలేయాలి.
– చెరుకుపల్లి కిరణ్‌కుమార్, వట్టిఖమ్మంపహాడ్

చిన్నపిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు

వీధుల్లో కుక్కల బెడదతో బయటకు వెళ్లడానికి చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షించాలి.
– ఎండీ. రఫీ, చివ్వెంల